భం
# గురువాణి

10 సెప్టెంబర్, 2026 సంచిక-267



## క్షమకు మించిన ఆయుధం లేదు

మనము గురువుల దగ్గర నుండి పొందవలసినది, గురువు మనకు ఇవ్వవలసింది ఏమి అంటే, గురువు అనుభవ పూర్వకంగా కొన్ని విషయాలు మనకు తెలుపుతాడు. అది ఏమి అంటే, ఓర్పుకి మించినటువంటి తపస్సు, సంతృప్తిని మించినటువంటి సుఖం, కనికరాన్ని మించినటువంటి పుణ్యం, క్షమను మించినటువంటి మహత్తరమైనటువంటి శక్తి ప్రపంచంలో ఇతరము లేదు, లేదు అని అనుభవ పూర్వకంగా మనకు తెలుపుతాడు. దీనిని మనము గురువుల దగ్గర నుండి నేర్చుకోవాలి.

క్షమా గుణం మహాత్ములలో ఉంటుంది. చూడండి జీసస్ క్రైస్తు మూడు సంవత్సరములు మాత్రమే ఆధ్యాత్మిక ప్రచారం చేసినాడు. ఇంత తక్కువ సమయంలోనే ఆయన మహత్తరమైనటువంటి కీర్తిని సంపాదించాడు.

తరువాత ఆనాటి ఛాందస వాదులు ఆయన మీద అపవాదు మోపి ఆయనను శిలువ వేసినారు. శిలువ వేసే సమయంలో అంత బాధను అనుభవించినప్పటికి ఆయన అంటాడు- పరమాత్మ వీళ్లు అమాయకులు, ఏమి చేస్తున్నారో వీరికి తెలియదు, అమాయకంగా వీరు చేసిన పనులను లెక్కలోకి తీసుకోకుండా వీళ్లను క్షమించండి, శిక్షించ వద్దు, వీళ్ళ పైన కనికరం చూపు, ప్రేమ చూపు. వీళ్లను క్షమించి ఆశీర్వాదం చెయ్యి పరమాత్మ అని అంటాడు.

కనుక శిష్య భక్తాదులారా క్షమను మించిన శక్తివంతమైన ఆయుధం ఈ ప్రపంచంలో లేనే లేదు. దీనిని ఆచరించి చూపినారు మహాత్ములైనటువంటి జీసస్ క్రైస్త్, శ్రీరామచంద్రుడు, మహామ్మద్ ప్రవక్త మొదలగు మహానుభావులు. కనుక శిష్య భక్తాదులరా మీరంతా కూడా గురు మార్గంలో నడుస్తూ, ఆ క్షమా గుణమును పెంపొందించుకొని, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగగలరని ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.